తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
06-08-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 179
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575




# పారదర్శకతకు నిలువెత్తు రూపం
# పాటిల్ మార్క్ విప్లవం!

- ఫీల్డ్ స్థాయి సమస్యలను నేరుగా పర్యవేక్షిస్తున్న సీఎండీ
- ఇంటింటికీ విద్యుత్ సేవలు
- ఆఫీసుల చుట్టూ తిరిగే తిప్పలు బంద్
- వర్షా కాలంలో లైన్ల మరమ్మతులు
- సురక్షిత విద్యుత్ సరఫరా
- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేగంగా సమస్యల పరిష్కారం
- అవినీతి అధికారులపై ప్రత్యక్ష నిఘా!
- తక్కువ కాలంలోనే అందరి మన్ననలు!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ నిరంతరం ప్రజల సంక్షేమం, సమర్థవంతమైన పాలన దిశగా కొత్త పుంతలు తొక్కుతోంది. సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ నిత్యం ఏసీ రూములకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల మధ్యే ఉంటూ, ఫీల్డ్ స్థాయిలో స్వయంగా పర్యటిస్తూ వినూత్న కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారు. ప్రజా ప్రభుత్వ లక్ష్యాలైన ప్రజల వద్దకే పాలన భావనకు పూర్తి స్థాయిలో ఊపిరి పోస్తూ, విద్యుత్ వినియోగదారులు ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా విద్యుత్ శాఖనే నేరుగా ప్రజల గుమ్మం ముందుకు తీసుకెళ్లేలా అత్యంత ప్రాధాన్యతా చర్యలు చేపట్టారు.

**మౌలిక సదుపాయాలు, ఫీల్డ్ సిబ్బంది రక్షణ**

సిబ్బంది రక్షణతో పాటు

మిగతా 2వ పేజీలో..






## తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

- తెలంగాణ-మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పీఎంకు లేఖ.. పీఎంవో స్పందనపై చర్చ
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామన్న కేంద్ర మంత్రి

**ఢిల్లీ, ఆగస్టు 5 , సిరి న్యూస్:**

ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదన్నారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి పాటిల్ కార్యాలయంలో

మిగతా 3వ పేజీలో..

## విద్యార్థులకు వీసాలు పెంచాలి

- అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కోరిన సీఎం రేవంత్

3

## సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు అనుమతి

- ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనాలో పర్యటన.

3

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ
### సంచలనం రేపిన ప్రైవేట్ కాలేజీల బాగోతం



- ఇంటర్ బోర్డు నుంచి అఫిలియేషన్ పొందేందుకు 8 కాలేజీల అక్రమాలు
- ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వైనం
- కాలేజీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- తక్షణమే కఠిన చర్యలకు పూనుకున్న హైడ్రా యంత్రాంగం
- మరో 60 కళాశాలల ఎన్‌వోసీలను సైతం క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడి

3



## ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

- కోతకు గురవ్వకుండా రిటెయినింగ్ వాల్ నిర్మాణం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

3



## డీలిమిటేషన్ బిల్లుకు రంగం సిద్ధం?

- ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం కసరత్తు
- మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపజేయడమే లక్ష్యం
- సంఖ్యాబల సమీకరణలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు

4

## తెలంగాణకు అన్యాయం..!



- అనుమతించిన ప్రాజెక్టుల రద్దు చరిత్రలో ఎప్పుడైనా జరిగిందా?
- 18న జరగబోయే జీఆర్ఎంబీ సమావేశం అజెండా పూర్తిగా ఏపీకి అనుకూలం
- ఏపీ వితండవాదాన్ని ఎందుకు ఖండించడంలేదు
- సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టును ఏపీ అడ్డుకుంటోంది
- రేవంత్ తెలంగాణకు ద్రోహం చేసి గురుదక్షిణ చెల్లించుకుంటున్నారా?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీష్‌రావు


**హైదరాబాద్, ఆగస్ట్ 5, సిరి న్యూస్:**

ఈనెల 18న హైదరాబాద్ వేదికగా హైదరాబాద్‌లో జరగబోయే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం అజెండాపై తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో ఎజెండాను సిద్ధం చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మౌనం చూస్తుంటే జీఆర్ఎంబీ సమావేశం కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందా అనే అనుమానం కలుగుతోంది. ఎజెండా వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం

మిగతా 2వ పేజీలో..

## హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

- కట్టు కథలతో బట్ట కాల్చి మీద వేయడమే మీ పనా?
- తొలుత కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పు
- ఏపీకి అమ్ముడుపోయి విమర్శలా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, సిరి న్యూస్:**

ఏపీ ప్రభుత్వం పన్నెండేళ్లుగా ప్రతీ బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నదని, ఇది కొత్త విషయం కాదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ ప్రాజెక్టులకు పరోక్షంగా మద్దతు ఇచ్చిన బీఆరఎస్ పార్టీ నేతలు అధికారం కోల్పోగానే కడుపు మంటతో బట్ట కాల్చి మీద వేస్తున్నారని విరుచుకుపడ్డారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆరఎస్ ఏ రోజూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేదని, ఆ పార్టీ ప్రభుత్వ హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగింది వాస్తవం కాదా, పోలవరం బనకచర్ల ప్రాజెక్టు పనులు ప్రారంuమైంది బీఆరఎస్ హయాంలో కాదా అని ప్రశ్నించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం మీరు అధికారంలో ఉండగా పూర్తి కాలేదా అని నిలదీశారు. తెలంగాణ సొమ్మును లూటీ చేసి అధికారం కోల్పోగానే మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 18న జరిగే 18 జీఆరఎంబీ సమావేశం అజెండాలో చేర్చిన అంశాలు కొత్తవేమీ కావని, ఇవే

మిగతా 2వ పేజీలో..

## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

2

- జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు..
- తీర ప్రాంత ప్రజలకు అధికారుల హెచ్చరికలు
- సరిహద్దు కృష్ణ బ్రిడ్జి వద్ద ఆహ్లాదకర దృశ్యాలు





## 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 5 , సిరి న్యూస్:**

స్వాతంత్ర్యానంతరం భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి, ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అప్పటి

మిగతా 2వ పేజీలో..



## 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

2

## 'వరల్డ్ పీపుల్స్'తో భారత్-రష్యా బంధాలు మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి

సోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. భారత్‌రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ఇది నిదర్శనమన్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని ఆ సంస్థ హెడ్ డాక్టర్ రాయల నీతునాయుడుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తు చేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్‌రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక జీవితంలో సముచిత స్థానం కల్పించడంలో రష్యా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క చెప్పార□T. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యాలయం ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకం, సంస్కృతి, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య పరస్పర సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వంతోపాటు సాంకేతిక రంగంలో ప్రపంచ గుర్తింపు పొందిన నగరమని పేర్కొన్న ఆమె ఈ కార్యాలయం భారత్‌రష్యా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించే వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్నేహం, శాంతి, అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనకు దోహదపడే ప్రతి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.



## ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, ఆగస్ట్ 5, సిరి న్యూస్:

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కర్ణాటక పరివాహక ప్రాంతాల నుంచి భారీగా ప్రవాహం రావడంతో కృష్ణా, భీమా నదుల్లో వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణానదిపై నిర్మించిన గుర్జాపూర్ బ్యారేజీ తో పాటు యాదగిరి జిల్లా భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీలకు వరద నీరు పోటె త్తింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఈ బ్యారే జీల 40 గేట్లను ఎత్తి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలా లు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టుకు చేరుతుండటం తో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరి హద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియో లు తీసుకుంటున్నారు. కృష్ణా నదిలో ప్రవాహం రోజురోజుకు వర ద ప్రవాహం పెరుగుతుండడంతో జూరా ల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివా హక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వర ద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## పారదర్శకతకు నిలువెత్తు రూపం
# పాటిల్ మార్క్ విప్లవం!

మొదటిపేజీ తరువాయి





వినియోగదారుల ప్రాణ భద్రతకు సీఎండీ జితేష్ వి. పాటిల్ అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ ప్రజాబాట-బస్తీబాట ద్వారా కేవలం ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో రాత్రింబవళ్లు ప్రాణాలకు తెగించి పనిచేసే లైన్‌మెన్లు, క్షేత్ర స్థాయి సిబ్బంది, సబ్ ఇంజనీర్లు సురక్షితంగా పనిచేసేలా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా వదులుగా ఉన్న విద్యుత్ తీగల బిగింపు, ఇంటర్ పోల్స్ ఏర్పాటు, దెబ్బతిన్న లేదా తుప్పు పట్టిన స్తంభాలు మరియు కండక్టర్ల మార్పిడి పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. అలాగే వరద ముంపు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ప్లింత్‌ల ఎత్తు పెంచి నిరంతర, నాణ్యమైన విద్యుత్‌తో పాటు సిబ్బందికి ఎలాంటి కరెంట్ షాక్ ప్రమాదాలు జరగకుండా పక్కా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.

**మధ్యవర్తుల దోపిడీకి చెక్.. వేగవంతమైన పరిష్కారాలు**

కొత్త విద్యుత్ కనెక్షన్లు, అదనపు లోడ్, పేరు మార్పు, కేటగిరీ మార్పు, బిల్లింగ్ తగాదాలు మరియు కన్స్యూమర్ సర్వీస్ సెంటర్లలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను మూలన పడేయకుండా ప్రాధాన్యతా క్రమంలో వేగంగా పరిష్కరించే బాధ్యతను ఇంజనీర్లకు అప్పగించారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఉన్నతాధికారులే సమస్యలను పర్యవేక్షిస్తుండటంతో రూపాయి ఖర్చు లేకుండా అవినీతికి తావులేకుండా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగింది. ఇది సాధారణ వినియోగదారులకు కొండంత అండగా మారింది.

**విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన**

సమస్యల పరిష్కారంతో పాటు, ప్రజలు మరియు రైతుల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గృహాల్లో సరైన ఎర్తింగ్ ఏర్పాటు, విద్యుత్ పొదుపుతో పాటు వర్షాల సమయంలో రైతులు మోటార్ స్టార్టర్లను ఆఫ్ చేయడం, విద్యుత్ లైన్లు మరియు స్తంభాల సమీపంలో పశువులను కట్టేయకుండా జాగ్రత్తపడటం వంటి కీలక సూచనలను స్వయంగా లౌడ్‌స్పీకర్లు, అవగాహన సదస్సుల ద్వారా అందిస్తున్నారు.

**సేవలో వినియోగదారుడే కేంద్రబిందువు**

ఈ వినూత్న సేవలు సంస్థ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేస్తున్నాయి. నాణ్యమైన, విశ్వసనీయమైన మరియు నిరంతర విద్యుత్ సేవలను ప్రతీ పల్లెకూ, ప్రతీ ఇంటికీ అందించడమే లక్ష్యంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ సాగిస్తున్న ఈ ప్రయాణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అధికారులకు, ఇతర ప్రభుత్వ శాఖలకు ఒక ఆదర్శవంతమైన మోడల్‌గా నిలుస్తోంది.

**వారానికి రెండ్రోజులు ప్రజాబాట-బస్తీబాట**

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో ప్రజాబాట-బస్తీబాట కార్యక్రమం అత్యంత వేగంగా నిర్వహించబడుతోంది. ఇదివరకు ఒకే రోజు కు పరిమితంగా ఉన్న ప్రజాబాట- బస్తీ బాట. ఇకనుండి రెండు రోజుల పాటు జరగనుంది.ప్రతి వారం మంగళవారం, గురువారం రోజుల్లో క్షేత్రస్థాయి అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది నేరుగా బస్తీలు, కాలనీలు, గ్రామాలు, తండాలు మరియు పట్టణ ప్రాంతాలకు వెళ్లి వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారం చూపేలా ఒక సమర్థవంతమైన వ్యవస్థను రూపొందించారు.

## 22ఏ భూముల పేరిట అన్యాయం జరగదు

హైదరాబాద్, ఆగస్ట్ 5, సిరి న్యూస్:

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూ హక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమావేశం క్యూర్ పరిధి జిలాల్లకు సంబంధించినదైనా ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి**

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్ లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని, దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## తెలంగాణాకు అన్యాయం..!

మొదటిపేజీ తరువాయి



దారుణమన్నారు. కేఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ సాధించుకున్న సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆయన మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ (47 టీఎంసీలు) వంటి 7 కీలక ప్రాజెక్టులకు తెచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన ఈ ప్రతిపాదనలను జీఆర్ ఎబీ తన అజెండాలో చేర్చడంపై నిప్పులు చెరిగారు. ఈ అజెండా పూర్తిగా ఏపీకి లాభం చేకూర్చేలా ఉందని ఆరోపించారు. రాష్ట్ర నీటి ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడికి 'గురుదక్షిణ' చెల్లించుకోవడానికే సీఎం నోరు మెదపడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతులు తీసుకురాలేకపోయిందని, ఉన్న అనుమతులను కూడా పోగొట్టుకునేలా ప్రవర్తిస్తోందని విమర్శించారు. సమ్మక్క బ్యారేజీకి అనుమతులు ఇవ్వవద్దని ఏపీ చెబితే, దాన్ని బోర్డు అజెండాలో ఎలా పెడతారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ కట్టొచ్చు కానీ సమ్మక్క బ్యారేజీ ఎందుకు వద్దంటున్నారని నిలదీశారు. కాళేశ్వరం అనుమతులు రద్దయితే సగం తెలంగాణకు తాగు, సాగునీరు దూరం అవుతుందని.. నీటి విషయంలో అన్యాయం జరిగితే తెలంగాణ ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలను గంపగుత్తగా ఏపీకి తాకట్టు పెట్టాలని చూస్తున్నారా? చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తుంటే... రేవంత్ రెడ్డి రక్తం ఎందుకు మరగడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదని పదేపదే చెబుతారు. కానీ జీఆర్ఎంబీ ముందు పెట్టిన ఎజెండా చూస్తే అసలు నిజం ఏంటో అర్థమవుతుంది. కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, కడెంగూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ వంటి ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని, వాటిని పునఃసమీక్షించాలని ఏపీ కోరుతోంది. సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన క్లియరెన్సులను కూడా నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఈ ఏడు ప్రాజెక్టుల అనుమతులను రివ్యూ చేయాలని ఏపీ కోరుతోంది. ఆ ప్రతిపాదనను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అనుమతుల వల్లే. ఇప్పుడు అదే సీతారామ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. తెలంగాణకు చెందిన ఏడు కీలక ప్రాజెక్టుల అనుమతులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? ఇప్పటికే అనుమతులు సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అధికారం ఎవరు ఇచ్చారు? తెలంగాణ కోసం ఉద్యమం చేసి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు. సమ్మక్క, పాలమూరు, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లు రిటర్న్ వచ్చాయి. ఒక్క టీఎంసీ నీటికి కూడా కొత్తగా అనుమతి సాధించలేదు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వం సాధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే పరిస్థితి తీసుకొచ్చారు. తెలంగాణ భవిష్యత్తుతో ఆడుకుంటారా? నిద్రపోతున్నారా? ఎజెండాలో ఈ అంశాలు రావడమే దుర్మార్గమైన విషయమన్నారు. దేశ చరిత్రలో అనుమతులు వచ్చిన తర్వాత వాటిని రివ్యూ చేయడం, రద్దు చేయడం జరిగిన సందర్భాలు ఎక్కడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. మరోవైపు సమ్మక్క బ్యారేజీకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని ఏపీ కోరుతోంది. సమ్మక్కకు అనుమతి ఇస్తే పోలవరానికి నీళ్లు తగ్గుతాయని ఏపీ ఎజెండాలో పేర్కొంది .గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని చంద్రబాబు ప్రభుత్వమే చెబుతోంది. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కు నీళ్లు తీసుకెళ్తామని చెబుతున్నారు. మరోవైపు తెలంగాణకు దక్కాల్సిన 968 టీఎంసీలలో భాగంగా సమ్మక్క ప్రాజెక్టు నిర్మిస్తామంటే ఏపీ అడ్డుకుంటోంది. సమ్మక్క సాగర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే అనుమతులు సాధించిందని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఇలాంటి ఎజెండా జీఆర్ఎంబీ ముందుకు వచ్చేదా? అని ప్రశ్నించారు. ఈ ప్రెస్ మీట్ లో మాజీ మంత్రులు ఎల్ల.మణ, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హరీష్.. తప్పుడు ప్రచారం మానుకోండి

మొదటిపేజీ తరువాయి

అంశాలను గత మీటింగులలో, కరెస్పాండెన్స్‌లో కూడా ఏపీ ప్రభుత్వం ప్రస్తావిస్తూ వస్తున్నదన్నారు. ఇవే అంశాలు సీతారామ ఎత్తిపోతల పథకం క్లియరెన్స్ విషయంలోనూ ప్రస్తావించిందన్నారు. దీనిపై తమ ప్రభుత్వం దీటుగా స్పందించి అవన్నీ నిరాధారమైనవని జీఆరఎంబీకి, సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకువెళ్లి ఎసఎసఎంపీఎసఆరఎలఐపీ టీఏసీ క్లియరెన్స్(158 మీటింగ్ తేదీ 24.04.2025) విజయవంతంగా అనుమతులు సాధించిందని మంత్రి ఉత్తమ్ గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏపీ ప్రభుత్వం నిరంతరం జీఆరఎంబీ, సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రిత్వ శాఖకు కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టుల అనుమతులు ఇవ్వరాదని కోరుతూ వచ్చిందని తెలిపారు. ఎంవోజేఎస్ ద్వారా టీఏసీ క్లియరెన్స్ పొందిన తరువాత కూడా సమీక్షించాలని ఏపీ ప్రతి మీటింగ్‌లో ప్రస్తావిస్తున్నదన్నారు. ఈ సందర్భంలో చెప్పదగ్గ విషయం ఏమిటంటే ఏపీ లేవనెత్తిన ఆ అంశాలను ఈ ప్రభుత్వం దీటుగా ప్రతిఘటించి మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడడంలో సఫలీకృతమైనదని స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉదాసీనత ప్రదర్శించడంలేదన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వమే 3వ జీఆరఎంబీ మీటింగ్‌లో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి ఆయా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాలి లేదా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి అని తన వైఖరిని స్పష్టం చేసిందని తెలిపారు. ఈ రెండు రాష్ట్రాలకు నీటి సరఫరా నియంత్రణను జీఆరఎంబీ ప్రారంభించే ముందే ఈ షరతులలో ఏదో ఒకటి నెరవేరాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ఇదే విషయాన్నీ పునరుద్ఘాటిస్తూ గత బీఆరఎస్ ప్రభుత్వం సెకండ్ అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో (6.10.2020) ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం ఏపీతో పోటీ పడి కోరిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకున్నదన్నారు. ఇదీ ఈ ప్రభుత్వం నిబద్ధత అని అన్నారు.

అంతర్రాష్ట్ర వ్యవహారాల(ఐఎసఎం) డైరెక్టరేట్ క్లియరెన్స్, ఏపీ క్లియరెన్స్ పొందడంలో గత ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముంపు సమస్యకు సంబంధించి కూడా గత ప్రభుత్వం ఆ రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని చాలాసార్లు సంప్రదించి/సందర్శించి, ఐఎసఎం డైరెక్టరేట్ క్లియరెన్స్ పొందేందుకు ముంపు సమస్యకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుండి నిరభ్యంతర పత్రం పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎన్‌వోసీ కోసం మూడుసార్లు ఛత్తీస్‌గఢ్ సీఎంను కలిసి ఎన్‌వోసీ కోసం విజ్ఞప్తి చేశామన్నారు. నెలాఖరులో ఇస్తామని సీఎం చెప్పారన్నారు. మీరు అధికారంలో ఉండగా ఒక్కసారి అయినా ఛత్తీస్‌గఢ్ సీఎం ను కలిశారా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభ్యంతరాలను సమర్థవంతంగా ప్రతిఘటించి రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి బహుళార్థసాధక సీతమ్మ సాగర్ - సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతులు 24.4.2025న సాధించిందని చెప్పారు. తొమ్మిదిన్నరేళ్లలో మీరు చేయలేని పని చేశామని, 67 టీఎంసీల నీటి కేటాయింపులు సాధించామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించినట్టు ట్రిబ్యునల్ ఏర్పరిచే విషయంలో కూడా ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తితో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుందన్నారు.

పీబీఎల్‌పీ ప్రతిపాదన గురించి తెలిసిన తర్వాత ఈ ప్రభుత్వం వెనువెంటనే స్పందించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ చెప్పారు. ఇప్పటివరకు ముఖ్యమంత్రి రెండుసార్లు, నీటిపారుదల శాఖ మంత్రిగా తాను ఏడుసార్లు, పదిసార్లు ప్రధాన కార్యదర్శి, ఈఎన్‌సీ(జి)19 సార్లు వివిధస్థాయిల అధికారుల ద్వారా ఎంవోఎఫ్, ఎంవోజేఎస్, ఎంవోఈఎఫ్ అండ్ సీసీ, సీడబ్ల్యూసీ, జీఆరఎంబీ, కేఆరఎంబీ, టీ పీపీఏలతో సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిపామన్నారు. న్యాయపరమైన చర్యలో భాగంగా ప్రభుత్వం సుప్రీమ్ కోర్టు ముందు ఒరిజినల్ సూట్, ఐఏ వ్యాజ్యాలు వేసిందన్నారు. ప్రతివాదులందరూ నాలుగు వారాల్లోగా తమ సమాధానాలను దాఖలు చేయాలని న్యాయస్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. 20182022 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతానికి 200 టీఎంసీల వరద నీటిని తరలించే పనులను ఏపీ ప్రభుత్వం చేపట్టినప్పటికీ అప్పటి బీఆరఎస్ ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితం కాలేదా అని నిలదీశారు. ఆర్డీఎస్‌లో వాటా మేరకు నీళ్ల కోసం ఏ రోజూ బీఆరఎస్ ప్రయత్నం చేయలేదన్నారు. ఆర్డీఎస్ ఆధునికీకరణ విషయంలో ఏపీ, కర్ణాటక సీఎంలను ఒప్పించాం.. మీరు ఏ రోజైనా కర్ణాటక సీఎంను కలిసి ఒప్పించారా అని నిలదీశారు. కేడబ్ల్యూడీటీలో కృష్ణా జలాల వాటా కోసం స్వయంగా విచారణకు హాజరై న్యాయనిపుణులతో సూచన చేశామన్నారు. గత ప్రభుత్వం కంటే సమర్థవంతంగా వాదనలు వినిపిస్తున్నామని, రాష్ట్ర ప్రజల నీటి హక్కులను పరిరక్షించేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని చెప్పారు. బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అనే సిద్ధాంతం కలిగిన బీఆరఎస్ ద్వంద్వ విధానాలతో తాము నేర్చుకోవాల్సింది ఏమీ లేదన్నారు. తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయనే కవిత ఆరోపణలకు జవాబు చెప్పాలన్నారు. ఆ ముడుపుల్లో నీ వాటా ఎంత. తెలంగాణలో అధికారంలోకి రావడం లేదని ఏపీతో కుమ్మక్కై నాగార్జున సాగర్ ప్రాజెక్టును వివాదం చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును నిండా ముంచి సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తావా అని మంత్రి హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తుమ్మిడిహెట్టికి అనుమతులు ఇప్పించండి

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తికి పంపిన లేఖ విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆరఎస్) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి వివరించారు. ఆ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని, కాబట్టి 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని వివరించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని మంత్రి పాటిల్ సీఎంకు తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్రస్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. ఆ తర్వాత రెండు రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని జల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.

**పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, డిండిలకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

పాలమూరురంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంటులో బుధవారం కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లిపై రూ.1,350 కోట్లు వ్యయం చేసిందని, అయితే అనుమతులు రాక పనులు నిలిచిపోయాయని, ఫలితంగా ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్ర మంత్రికి వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు సానుకూలత నేపథ్యంలో ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్ కోరారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వీసాలు పెంచాలి



దిల్లీ, ఆగస్టు 5, సిరి న్యూస్ :

ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఆయనతో దిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. 30 నిమిషాలకుపైగా కొనసాగిన ఈ భేటీలో వివిధ అంశాలు చర్చించారు. తెలంగాణలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్1బి వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని, . వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని కోరారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. దేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకున్నదన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర బలాలపై రాయబారి చూపిన ఆసక్తిని ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణఅమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చారు.

# ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు

భద్రాచలం, ఆగస్టు 5, సిరి న్యూస్ :

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనానికి దేశ విదేశాల నుండి భక్తులు లక్షల మంది వస్తూ ఉంటారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యం కోసం రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని వ్యవసాయ, మార్కెటింగ్, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత వరదల సమయములో రెండో బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు కోతకు గురైన విషయం విదితమే. ఈ రోడ్డు పునర్నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించి అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకుని నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతం చేసి ఈ నెలలో బ్రిడ్జిపై రాకపోకలు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు దేశ విదేశాల నుండి భక్తులు రామయ్య దర్శనానికి వస్తూ ఉంటారని, అలాగే ముఖ్యమైన గోదావరి పుష్కరాలు, ముక్కోటి, శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాల సందర్భంగా భక్తులు అధికంగా వస్తుంటారన్నారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని 2015 లో జరిగిన గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒకే బ్రిడ్జి వల్ల ట్రాఫిక్ సమస్యలు రావడంతో అమరావతి టు జగదల్పూర్ జాతీయ రహదారి భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండవ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రారంభించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం పనులు నత్తనడకగా సాగాయని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూసామని అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండవ బ్రిడ్జి అందుబాటులో ఉంటుందని అన్నారు. వరదలు ఎన్ని వచ్చినా అప్రోచ్ రోడ్డు కోతకు గురవకుండా పకడ్బందీగా రిటైనింగ్ వాల్ నిర్మాణం పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేసి రెండవ బ్రిడ్జిపై రాకపోకలు జరిగేలా చూస్తామని అన్నారు. రెండవ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో ఆంధ్ర ప్రదేశ్, ఛత్తీస్గడ్, ఒడిస్సా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- **అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలి**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

హైదరాబాద్, ఆగస్టు 5, సిరి న్యూస్:

డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ 2026 గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సచివాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ' అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

హైదరాబాద్‌లో సంచలనం రేపే ఫోర్జరీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్నే కొందరు ముఠాగా ఏర్పడి ఫోర్జరీ చేసినట్లు తేలింది. నగరంలోని ఏకంగా 8 ప్రముఖ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఈ ఫోర్జరీ సంతకాలు, నకిలీ నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) ఆధారంగా ఇంటర్మీడియట్ బోర్డు నుంచి గుర్తింపు పొందేందుకు ప్రయత్నించడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. హైడ్రా నుంచి ఎలాంటి అధికార అనుమతులు తీసుకోకుండా, కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను తయారు చేశారు. అనంతరం ఆ నకిలీ పత్రాలను ఇంటర్మీడియట్ విద్యారంగంలో అఫిలియేషన్ పొందడానికి సదరు కాలేజీలు బోర్డుకు సమర్పించాయి. అయితే, దరఖాస్తుల పరిశీలన సమయంలో ఇంటర్ బోర్డు, హైడ్రా అధికారులు సదరు సర్టిఫికెట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో అసలు బాగోతం బయట పడింది. ఆ పత్రాలు పూర్తిగా ఫేక్ అని, వాటిపై ఉన్న కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసినట్లు స్పష్టమైంది. దీంతో ఈ మోసం వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన హైడ్రా యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలకు పూనుకుంది. ఫోర్జరీ అక్రమాలకు పాల్పడిన మొత్తం 8 ప్రైవేట్ కాలేజీల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లాల్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసింది. మరో 60 కళాశాలల ఎన్‌వోసీలను పరిశీలిస్తున్నట్లు హైడ్రా అధికారులు తెలిపారు.

**ఫోర్జరీకి పాల్పడిన కాలేజీల జాబితా..**

- మెహిదీపట్నంలోని ప్రియాంక జూనియర్ కాలేజ్
- విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్
- చాంద్రాయణగుట్టలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్
- చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కాలేజ్
- శివరాంపల్లిలోని షాహీర్ జూనియర్ కాలేజ్
- ల్లాపూర్‌లోని వశిష్ట జూనియర్ కాలేజ్
- బర్కత్‌పూర్‌లోని హైందవి జూనియర్ కాలేజ్
- ఎస్సార్ నగర్లోని రెసిడెన్స్ జూనియర్ కాలేజ్

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **గాంధీ భవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి'**
- **ప్రతి వినతిపై బాధ్యతగా స్పందించి న్యాయం చేస్తాం**
- **పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**



హైదరాబాద్, ఆగస్టు 5, సిరి న్యూస్ :

ప్రజల విశ్వాసమే మా బలం.. ప్రజల మాటే ప్రభుత్వ నిర్ణయాలకు మార్గదర్శకం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, పాలకులు ప్రజలకు దూరంగా ఉండటంతో అనేక సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రజల కష్టాలు, బాధలు, ఆశలు, ఆకాంక్షలు తెలుసుకోవాలంటే ప్రజల మధ్యకే వెళ్లాలన, అందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహిస్తోందని తెలిపారు. గాంధీ భవన్‌లో ముఖాముఖి కార్యక్రమం బుధవారం జరగగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి సీతక్క నేరుగా వినతులు స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో సమీక్షించారు. వచ్చిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని, పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలు వినడమే కాక వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రజా పాలనలో ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు.

**ప్రధానంగా వచ్చిన వినతులు**

ధరణి అమలులో జరిగిన అక్రమాల కారణంగా తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని, రాత్రికి రాత్రే పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు జరిగాయని పలువురు బాధితులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు రాని అర్హులైన కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచాలని యువత విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతో నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అటవీ శాఖ అధికారుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ హక్కులను పరిరక్షించాలని కోరుతూ పలువురు గిరిజనులు, అటవీ ప్రాంతాల ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయానికి గురైన వివిధ వర్గాలకు న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో ప్రజలు కోరారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లుగా గత ప్రభుత్వం వదిలివెళ్లిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోందని తెలిపారు. ప్రజలు ప్రజా ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసంతోనే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి తమ వినతులను అందజేస్తున్నారని చెప్పారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్ విదేశీ పర్యటనకు
# ఏసీబీ కోర్టు అనుమతి



హైదరాబాద్, ఆగస్టు 5, సిరి న్యూస్:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అనుమతించింది. ఇందుకోసం కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్ పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు రేవంత్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పాస్ పోర్టులను తాత్కాలిక కస్టడీనుంచి విడుదల చేయడంతోపాటు విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పిటిషన్ ను పాక్షికంగా అనుమతించింది. విదేశీ పర్య టనకు అనుమతి ఇస్తూనే కోర్టు పలు షరతులు విధించింది. లక్ష వ్యక్తిగత బాండ్ తోపాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, అక్కడ బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లు కోర్టుకు అందజేయాలని పేర్కొంది. అలాగే, సెప్టెంబర్ 18లోగా పాస్ పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానని అఫిడవిట్ దాఖలు చేయాలని రేవంత్ రెడ్డిని ఆదేశించింది. ఆ అఫిడవిట్ సమర్పించిన అనంతరం ప్రాంతీయ పాస్ పోర్టు అధికారికి లేఖ రాసి పాస్ పోర్టులను తాత్కాలికంగా అప్పగించాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది.

# డయల్ 112 సేవలు ప్రారంభం

- **పోలీస్,ఫైర్, అంబులెన్స్‌కు ఇక ఒక్కటే నంబర్**
- **సేవలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్,ఆగస్ట్ 5, సిరి న్యూస్:

రాష్ట్రంలో డయల్ 112 సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఏ ఫిర్యాదుకైనా ఇక 112 ద్వారా సమాధానం వస్తుంది. డీజీపీ సీవీ ఆనంద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ డయల్ 112 ద్వారా 18 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. న్యాయసాయం, వైద్యసాయం, సైబర్‌సాయం అనేక సమస్యల పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గమని వ్యాఖ్యానించారు. డయల్ 112కు ఫోన్ చేసినప్పుడు పోలీసులు దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఒకే వ్యవస్థలోకి పోలీస్, ఫైర్, అంబులెన్స్ సేవలు, టిజిఐసిసి నుంచి డయల్ 112 సేవలను పర్యవేక్షి స్తామని డీజీపీ తెలిపారు. ప్రజల భద్రత, అత్యవసర స్పందన సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వెల్లడించారు. డయల్ 112 ఫోన్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ కాల్స్ వాడుతున్నామని పేర్కొన్నారు. డ్రోన్ బెస్డ్ టెక్నికల్ సిస్టంను త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తారని వివరించారు. డ్రోన్ టీమ్‌ను సైతం ఏర్పాటు చేయబోతున్నామని చెప్పుకొచ్చారు. డయల్ 112 అనేది 3.0 వర్షన్‌గా ఉంటుందని తెలిపారు. యువ ఏపీఎస్‌లు, ఏఐ టెక్నాలజీ వాడే వారిని ఇందులో భాగస్వామ్యం చేయబోతున్నామని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు. బేసిక్ పోలీసింగ్ లాగా టెక్నాలజీ పోలీసింగ్‌ను అమల్లోకి తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్‌లో రెండు ఫ్లోర్‌లను డయల్ 112కి కేటాయించామని తెలిపారు. డయల్ 100ను 2013లో కొంపల్లిలో జివికె వారి సాయంతో ప్రారంభించామని ప్రస్తావించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రప్రభుత్వం సూచించిందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ వచ్చామని అన్నారు. ఇటీవల ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా అయిపోతున్నాయని డీజీపీ ఆనంద్ వెల్లడించారు.








## జంతర్‌మంతర్ ఆందోళనలే లక్ష్యంగా కుట్ర?

- **ఐఎస్ఐ మద్దతు ఉన్న రెండు ముఠాల గుట్టురట్టు**
- **నలుగురు మైనర్లతో సహా తొమ్మిది మంది అరెస్ట్**
- **పెట్రోల్ బాంబులతో దాడుల యత్నం భగ్నం**
- **రైల్వే ట్రాక్‌ల వద్ద నిఘా కోసం కెమెరాల ఏర్పాటు**
- **హవాలా ద్వారా నిధులు అందినట్లు అనుమానం**

**అమృత్‌సర్, ఆగస్టు 5, సిరి న్యూస్:**

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలను ఆసరాగా చేసుకుని దేశంలో విధ్వంసక చర్యలకు పాల్పడే కుట్రను అమృత్‌సర్ పోలీసులు భగ్నం చేశారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్న రెండు ఉగ్రవాద ముఠాలను గుర్తించి, నలుగురు మైనర్లతో పాటు మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి కుట్రకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.
పోలీసుల సమాచారం ప్రకారం, అరెస్టైన వారిలో ఎనిమిది మంది జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదేశాన్ని సందర్శించినట్లు గుర్తించారు. అక్కడ పెట్రోల్ బాంబుల తయారీకి అవసరమైన సామగ్రి, ఇతర లాజిస్టిక్ సహకారం అందినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో పాకిస్థాన్‌లో ఉన్న ఐఎస్ఐ హ్యాండ్లర్ల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ మాట్లాడుతూ, ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్న రెండు ఉగ్ర ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించామని తెలిపారు. ఒక ముఠా రైల్వే ట్రాక్‌ల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి దృశ్యాలను సరిహద్దు దాటి పంపే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యకలాపాలకు అవసరమైన నిధులు హవాలా మార్గంలో సమకూరినట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. రెండో ముఠాకు ఐఎస్ఐ హ్యాండ్లర్లు పెట్రోల్ బాంబుల తయారీ, వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. పోలీసు, భద్రతా సంస్థలపై దాడులకు ముందు రెక్కీ నిర్వహించాలని వారికి సూచించినట్లు వెల్లడించారు. అయితే భద్రతా సంస్థలు సకాలంలో చర్యలు తీసుకోవడంతో వారి ప్రణాళికలు అమలు కాలేదని పేర్కొన్నారు. ఈ కేసులో మరికొందరు కీలక వ్యక్తుల ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే కుట్రను ముందుగానే భగ్నం చేయడం పెద్ద విజయమని అధికారులు పేర్కొన్నారు.

## 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారు..

- **నీట్ నిరసనల అణచివేతపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు**
- **విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని విమర్శ**
- **పారదర్శక విద్యా వ్యవస్థ కోసం పోరాడుతున్న యువతకు మద్దతు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5, సిరి న్యూస్:**

నీట్ పేపర్ లీక్ వివాదంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలను కేంద్ర ప్రభుత్వం బలప్రయోగం, బెదిరింపులతో అణచివేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, యువతపై వ్యవహరించిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల ఇళ్లకు గుండాలను పంపించారని, అనంతరం 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ క్షమాపణలను అంగీకరించడం పూర్తిగా అర్థరహితమని, ఇలాంటి చర్యలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, వారిని వేధించారని కూడా ఆయన విమర్శించారు. తమ భవిష్యత్తు కోసం శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు ఎలాంటి హింసకు పాల్పడలేదని, అలాంటి వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. దేశానికి పారదర్శకంగా, విశ్వసనీయంగా పనిచేసే విద్యా వ్యవస్థ అవసరమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు రాజ్యాంగ పరిరక్షకులని, కుప్పకూలుతున్న విద్యా వ్యవస్థను ప్రశ్నించడం వారి హక్కు అని అన్నారు. తమ భవిష్యత్తు కోసం ధైర్యంగా పోరాడుతున్న యువతకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, వారి పోరాటంపై గర్వంగా ఉందని తెలిపారు.

## జార్ఖండ్ నిరుద్యోగులకు సీజేపీ మద్దతు

- **దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తాం**
- **రాజకీయ పార్టీగా మారే ఆలోచన లేదు**
- **సీజేపీ నేత అభిజిత్ దీప్కే స్పష్టీకరణ**



**ముంబై, ఆగస్ట్ 5, సిరి న్యూస్ :**

జార్ఖండ్ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ నిరసనలు తెలుపుతున్న అభ్యర్థులకు కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మద్దతు ప్రకటించింది. అవసరమైతే రాంచీకి వెళ్లి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో డియాతో మాట్లాడిన దీప్కే, జూలై 29 నుంచి రాంచీలో జరుగుతున్న నిరవధిక ఆందోళనకు తమ సంఘీభావం ఉంటుందని చెప్పారు. తాము తప్పకుండా జార్ఖండ్ వెళ్తామని, అక్కడి విద్యార్థుల ప్రతీ డిమాండ్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ప్రస్తుతం సీజేపీ రాజకీయ పార్టీగా కాకుండా, ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని దీప్కే వెల్లడించారు. న్యాయవ్యవస్థ, రాజకీయాలు, డియా, ఎన్నికల సంఘం వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం తగ్గుతోందని, వీటిలో జవాబుదారీతనం తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమని చెప్పారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు ఇతర నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులతో స్వతంత్ర దర్యాప్తు జరపాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# డీలిమిటేషన్ బిల్లుకు రంగం సిద్ధం?

- **ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలపై కేంద్రం కసరత్తు**
- **మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపజేయడమే లక్ష్యం**
- **సంఖ్యాబల సమీకరణలో బీజేపీ వ్యూహాత్మక అడుగులు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5, సిరి న్యూస్:**

డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లుల ఆమోదంపై కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13తో ముగియనున్న నేపథ్యంలో, ఆగస్టు 17 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశాల్లో ఈ రెండు కీలక బిల్లులను ఆమోదింపజేయాలని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంట్‌ను అధికారికంగా ప్రొరోగ్ చేయకుండా ఉంచే అవకాశం ఉంది. అవసరమైన సమయంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులు కావడంతో డీలిమిటేషన్ బిల్లుకు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అందుకే అవసరమైన సంఖ్యాబలాన్ని సమీకరించేందుకు బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. అయితే తగిన సంఖ్యాబలం లేకపోవడంతో అప్పట్లో బిల్లుల ఆమోదం సాధ్యపడలేదు. అనంతరం దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాలతో ప్రస్తుతం పరిస్థితులు మారినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ప్రస్తుతం ఎన్డీయేకు ఉన్న బలం సరిపోకపోవడంతో ఇతర పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు సమాచారం. టీఎంసీ నుంచి విడిపోయిన ఎంపీలు, డీఎంకేలోని కొంతమంది సభ్యులు, మహారాష్ట్రలోని శివసేన, ఎన్సీపీ వర్గాల మద్దతు లభిస్తే అవసరమైన సంఖ్యకు చేరుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం ఉండటంతో సమాజ్‌వాదీ పార్టీ వైఖరిలో కూడా మార్పు వచ్చే అవకాశాలపై చర్చ జరుగుతోంది. అవసరమైన మద్దతు ఖరారైన వెంటనే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు కేంద్రం పిలుపునిచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై దేశ రాజకీయాల్లో మరోసారి కీలక చర్చ మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



## యువత ఆవేదనను వినాలి

- **సీజేపీ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**
- **విద్యార్థుల పట్ల సంయమనం పాటించాలని అధికారులకు సూచన**
- **హింసతో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదమని హెచ్చరిక**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5, సిరి న్యూస్:**

సీజేపీ నిర్వహిస్తున్న నిరసనల నేపథ్యంలో యువ విద్యార్థి నిరసనకారుల పట్ల అధికారులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనల సమయంలో పోలీసు బలగాలు కూడా సహనంతో వ్యవహరించాలని, హింసను అరికట్టే పేరుతో అతిగా స్పందిస్తే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు.
ఢిల్లీతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో సీజేపీ చేపట్టిన ఆందోళనల్లో హింస, రాళ్లదాడులు జరిగాయని, వాటివల్ల కలిగిన నష్టానికి పార్టీనే బాధ్యులను చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌ను విద్యార్థి ఆందోళనలకు సంబంధించిన ఇతర పిటిషన్లతో కలిపి విచారించాలని ధర్మాసనం నిర్ణయించింది.
ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, యువత ఎందుకు ఆందోళన చేస్తోంది, వారు ఏమి చెప్పాలనుకుంటున్నారో ముందుగా ఓపికగా వినాలని సూచించారు. యువత ఆవేదనను ఆలకించడమే సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రభావవంతమైన మార్గమని వ్యాఖ్యానించారు.
అదే సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో భద్రతా సంస్థల విచక్షణపై సుప్రీంకోర్టు విశ్వాసం వ్యక్తం చేసింది. పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో అధికారులకు అవగాహన ఉందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం, సంబంధిత పక్షాల వాదనలు పరిశీలించిన అనంతరం తదుపరి విచారణలో తగిన నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. జులై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో రాళ్లదాడులు, లాఠీచార్జ్, వాటర్ క్యానన్ల వినియోగం కారణంగా విద్యార్థులు, పోలీసు సిబ్బంది గాయపడిన విషయం విచారణ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో యువత ఆవేదనను అర్థం చేసుకుంటూ శాంతియుత పరిష్కారాల దిశగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది.

## ఎయిరిండియాకు కొత్త సారథి

- **సీఈవో, ఎండీగా టెవోల్డే గెబ్రెమరియమ్ నియామకం**
- **భారీ నష్టాల నేపథ్యంలో టాటా గ్రూప్ కీలక నిర్ణయం**
- **ప్రస్తుత సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్‌కు వీడ్కోలు**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5, సిరి న్యూస్:**

భారీ నష్టాలు, వరుస సవాళ్లతో ముందుకు సాగుతున్న ఎయిరిండియాలో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. సంస్థ కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ చీఫ్ టెవోల్డే గెబ్రెమరియమ్‌ను నియమిస్తున్నట్లు టాటా గ్రూప్ బుధవారం ప్రకటించింది. ప్రస్తుతం సీఈవోగా ఉన్న క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. గత ఏడాది అహ్మదాబాద్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదం, సంస్థకు పేరుకుపోతున్న భారీ నష్టాల నేపథ్యంలో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. 202526 ఆర్థిక సంవత్సరంలో ఎయిరిండియా 2.8 బిలియన్ డాలర్ల మేర నష్టాలను నమోదు చేసింది. అదనంగా పాకిస్థాన్ గగనతలం మూసివేత, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావంతో పలు అంతర్జాతీయ సర్వీసులు నిలిచిపోవడంతో సంస్థ పునరుద్ధరణ ప్రణాళికలకు ఆటంకం ఏర్పడింది. టెవోల్డే గెబ్రెమరియమ్ ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు దశాబ్దానికి పైగా నాయకత్వం వహించారు. ఆయన హయాంలో ఆ సంస్థ ఆఫ్రికాలోనే అతిపెద్ద, అత్యంత లాభదాయకమైన విమానయాన సంస్థగా ఎదిగింది. సంస్థ ఆదాయాన్ని నాలుగు రెట్లు, విమానాల సంఖ్యను మూడు రెట్లు పెంచడంలో కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ హబ్‌ల అభివృద్ధి, నిర్వహణ, మరమ్మతుల మౌలిక సదుపాయాల విస్తరణలో ఆయనకు విశేష అనుభవం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎయిరిండియాను వృద్ధి, లాభదాయకత దిశగా నడిపించే సామర్థ్యం గెబ్రెమరియమ్‌కు ఉందని సంస్థ బోర్డు విశ్వాసం వ్యక్తం చేసింది. టాటా సన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ, స్థిరీకరణ, విలీన ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇప్పుడు సంస్థ విస్తరణ దశలోకి అడుగుపెడుతోందని తెలిపారు. గెబ్రెమరియమ్ అనుభవం ఎయిరిండియాను ప్రపంచ స్థాయి విమానయాన సంస్థగా తీర్చిదిద్దడంలో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2022లో టాటా గ్రూప్ ఎయిరిండియాను స్వాధీనం చేసుకున్న తర్వాత సింగపూర్ ఎయిర్‌లైన్స్ మాజీ అధికారి క్యాంప్‌బెల్ విల్సన్‌ను సీఈవోగా నియమించింది. విలీన ప్రక్రియలు పూర్తి చేయడం, భారీ విమానాల కొనుగోలు ఒప్పందాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలను సంస్థ ఈ సందర్భంగా ప్రశంసించింది.

# ఎట్టకేలకు దిగి వచ్చిన 'మెటా'

- **ప్రధాని మోదీకి జుకర్ బర్గ్ క్షమాపణలు**
- **కంటెంట్‌ల బూస్ట్‌కు డబ్బులు తీసుకున్నట్లు అంగీకారం**




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5, సిరి న్యూస్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి బహిరంగ క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతేకాక తమ ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీకి క్షమాపణలు చెప్పింది. ప్రధాని మోదీ ఫేస్‌బుక్ పోస్టు తాత్కాలికంగా తొలగించిన వ్యవహారం మెటాకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం సమన్లు జారీ చేయడంతో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. దాదాపు 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. మెటా గ్లోబల్ వ్యవహారాల అధికారి జోయెల్ కాప్లన్ నేతృత్వంలోని బృందం ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. అలాగే కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కూడా మెటా బృందం కలిసింది. జూలై 23న ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పిన వీడియోను ఫేస్‌బుక్ కొంతసేపు పరిమితం చేసింది. అనంతరం అది సాంకేతిక లోపం వల్ల జరిగిందని మెటా వివరణ ఇచ్చి పోస్టును పునరుద్ధరించింది. అయితే ఈ వివరణ సరిపోదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సమావేశంలో ప్రధాని పోస్టు వ్యవహారంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు, కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు సమాచార నియంత్రణ వంటి అంశాలపై కూడా ప్రశ్నలు సంధించింది. ప్రముఖ వ్యక్తుల ధృవీకరించిన ఖాతాల్లోని పోస్టులను తొలగించే ముందు మరింత భద్రతా వ్యవస్థ ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. మెటా అల్గోరిథమ్ ఎలా పనిచేస్తోంది? పోస్టులు ఏ ప్రాతిపదికన తొలగించబడుతున్నాయి? భారత చట్టాలకు అనుగుణంగా వ్యవస్థ ఎలా పనిచేస్తుంది వంటి అంశాలపై కూడా ప్రభుత్వం వివరణ కోరింది. దేశ భద్రత, ప్రజా శాంతి వంటి అంశాలకు సంబంధించిన విషయాల్లో సోషల్ మీడియా వేదికలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేసింది. సోషల్ డియా సంస్థలు భారత చట్టాలను పూర్తిగా పాటించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతోపాటు, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా మెటా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించినట్లు సమాచారం.

## సైబర్ జాగ్రుత్ దివస్‌లో భాగంగా..
### మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం



**రామాయంపేట, ఆగష్టు 5 (సిరి న్యూస్)**

రామాయంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ జాగ్రుత్ దివస్ కార్యక్రమంలో భాగంగా సీఐ సైదా నాయక్ అధ్యక్షతన సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా మోసాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించారు. "స్టే అలర్ట్ – స్టే అవేర్ – స్టే సైబర్ సేఫ్" అనే సందేశంతో సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని సీఐ సైదా నాయక్ సూచించారు. కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై బాలరాజు,కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ లో యోగా కరాటే తరగతులు
### ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు సాంబయ్య



**వెల్దుర్తి,ఆగస్టు 05,( సిరి న్యూస్):**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి యందు బుధవారం రోజు కరాటే, యోగ, కార్యక్రమాలు ప్రారంభించిన ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య . ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ రోజు కరాటే, యోగ కార్యక్రమాలు ప్రారంభించుకోవడం జరిగిందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య అన్నారు. ప్రతిరోజూ యోగా, కరాటే, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు ఇందిరా విద్యార్థులకు యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం,వంటి అంశాలపై శిక్షణ అందిస్తుండగా, కరాటే మాస్టర్ ఈ.వైష్ణవి ఆత్మరక్షణ విద్య, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా కరాటే శిక్షణను అందిస్తున్నారు.అని వారు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మరక్షణ నైపుణ్యాలను అలవరచుకోవడానికి యోగా, కరాటే, శిక్షణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ శిక్షణలో క్రమం తప్పకుండా పాల్గొని ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు శ్రీనివాస రావు, నర్సింహా రెడ్డి, అర్చన, వెంకటస్వామి, నవనీత, అమూల్య, జయసుధ, శైలజ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేతకాని హక్కుల కోసం ఢిల్లీ పోరు..

- నేతకాని పేరుకే న్యాయం.!..
- కేంద్రానికి చేరిన డిమాండ్..
- పోరాటం కొనసాగుతుందన్న ఎంపీ వంశీకృష్ణ..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05 (సిరి న్యూస్)**



ప్రభుత్వ రికార్డుల్లో నెట్కానిగా నమోదైన పేరును సరిచేసి అసలు పేరు నేతకానిగా నమోదు చేయాలనే డిమాండ్ మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. నేతకాని సామాజిక వర్గం ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ అంశాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ ఎదుట బలంగా ప్రస్తావిస్తూ, పేరు మార్పు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వీరేంద్ర కుమార్ స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రతిపాదన అందిన తర్వాతే ప్రక్రియ ముందుకు సాగుతుందని తెలిపారు. అనంతరం భారత ప్రధాన జనాభా నమోదుల అధికారి, జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి అవసరమైన సిఫార్సులు వచ్చిన తర్వాత ప్రభుత్వం పేరు మార్పుపై తుది నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత అధికారులతో, ముఖ్యంగా లక్ష్మణ్ కుమార్‌తో చర్చించినట్లు గడ్డం వంశీకృష్ణ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారిక లేఖను కేంద్ర మంత్రిత్వ శాఖకు పంపేలా చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో నేతకాని వర్గ ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయడమే తన లక్ష్యమని గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. నేతకాని సమాజం గౌరవం, ఆత్మగౌరవం, చారిత్రక గుర్తింపుకు సంబంధించిన ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రతి దశను స్వయంగా పర్యవేక్షిస్తానని పేర్కొన్నారు.ప్రభుత్వ రికార్డుల్లో సరైన పేరు నేతకాని నమోదయ్యే వరకు తమ పోరాటం ఆగదని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేసి అవసరమైన అనుమతులు, సిఫార్సులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు. దీంతో నేతకాని సామాజిక వర్గం ఆశలు మరోసారి కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై నిలిచాయి.

# కాలనీల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- ఒక కోటి 40 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 5, (సిరి న్యూస్):**

పటాన్ చెరు, ముత్తంగి డివిజన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని నందన్ ప్యారడైజ్ కాలనీలో 67.5 లక్షల రూపాయలతో చేపట్టనున్న సిసి రోడ్లు, ముత్తంగి డివిజన్ పరిధిలోని డిఎన్ కాలనీలో 36.5 లక్షల రూపాయలతో చేపట్టనున్న పైపులైను నిర్మాణ పనులు, వెలిమల స్మశాన వాటికలో 36.08 లక్షల రూపాయలతో చేపట్టనున్న రిటైనింగ్ వాల్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలోని ప్రతి కాలనీని అన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా, విద్యుత్ సదుపాయాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ



సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ విభాగం ఈఈ సురేష్, డిఈ కృష్ణవేణి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాములు గౌడ్, శ్రీకాంత్ గౌడ్, విజయ్ కుమార్, ఉపేందర్, దేవేందర్ యాదవ్, కొమరయ్య, శ్రీశైలం, ఉమేష్, నాగరాజు, రవీందర్ రెడ్డి, నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్ రామకృష్ణ వెంకటేష్, అశోక్, రాజ్ కుమార్, రామకృష్ణ, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలి

**కుత్బుల్లాపూర్.జులై.05 ( సిరి న్యూస్).**

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసేలా ప్రతి ఒక్కరు ముందుకు రావాలని బీజేపీ నాయకులు అన్నారు.బుధవారం నాడు కుత్బుల్లాపూర్ నియోజికవర్గంలో వెంకటేశ్వరగార్డెన్ రాఘవేంద్ర కాలనీ సుచిత్రలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ డా:మల్లారెడ్డి.రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి పాల్గొని సీనియర్ నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసేలా ప్రజల్లో అవగాహన మరియు చైతన్యం తీసుకురావాలని అన్నారు.హర్ ఘర్ తిరంగా దేశభక్తిని పెంపొందించడం జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని చాటడం మరియు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చేపట్టే ముఖ్యమైన పలు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో నందనం దివాకర్.బక్క శంకర్ రెడ్డి.ఎమ్మెస్



వాసు.జిల్లా ప్రధాన కార్యదర్సులు విగ్నేశ్వరచారీ ,గిరి వర్ధన్ రెడ్డి భరత సింహారెడ్డి.దాసి నాగరాజు.మరియు జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా పదాధికారులు డివిజన్ అధ్యక్షులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అప్రమత్తతే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

- 'సురక్షా తిరంగా'లో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన
- ఎస్సై శ్రీనివాస్ గౌడ్

**పాపన్నపేట, ఆగస్టు 5 సిరి న్యూస్ :**

సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. 'సురక్షా తిరంగా' కార్యక్రమంలో భాగంగా పాపన్న పేటలోని కళాశాలలో బుధవారం నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు సైబర్ భద్రతపై విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్



వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లోపెరుగుతున్నాయని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్, సోషల్ మీడియా లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించరాదని స్పష్టం చేశారు.ఫేక్ ఉద్యోగాల ప్రకటనలు, ఆన్‌లైన్ పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్, కేవైసీ అప్‌డేట్, లాటరీ, రివార్డు పేర్లతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నందున ప్రతి సందేశాన్ని, ప్రతి లింకును జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే స్పందించాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరానికి గురైన వెంటనేఆలస్యంచేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, సకాలంలో ఫిర్యాదు చేస్తే నష్టాన్ని నివారించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వివరించారు. విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగంచేసుకుంటూనేడిజిటల్భద్రతా నియమాలను పాటించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు , అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీనివాస్ , విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సోమేశ్వర స్వామిని దర్శించుకున్న బూరుగడ్డ పుష్పనగేష్

- రానున్న బోనాల ఉత్సవాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ

**రామచంద్రపురం, ఆగస్టు 5 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలోని సండే మార్కెట్ వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులతో మాట్లాడిన బూరుగడ్డ పుష్పనగేష్, రానున్న ఆషాఢమాసం, శ్రావణమాస బోనాల ఉత్సవాలకు అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. బోనాల సందర్భంగా ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లు కల్పించేందుకు తన వంతు



సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- వీరన్నగూడెంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం
- మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్

**గుమ్మడిదల, ఆగస్టు 5 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని



కుమార్ గౌడ్ తెలిపారు. మున్సిపాలిటీలోని 10వ వార్డు వీరన్నగూడెంలో వీరభద్రస్వామి కమాన్ నుంచి దేవస్థానం వరకు సుమారు 500 మీటర్ల పొడవున రూ.15 కోట్ల ప్రత్యేక నిధుల నుంచి రూ.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలతో పాటు వీరభద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, మున్సిపాలిటీ సమగ్ర అభివృద్దే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కుమార్ గౌడ్, నాయకులు హుసేన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# నేడే ప్రజాయుద్ధనౌక గద్దర్ 3 వ వర్ధంతి సభ..

**ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండ ఎల్లం.**

**రామాయంపేట, ఆగష్టు 5 (సిరి న్యూస్)**

ఈనెల 6న, హైదరాబాద్ లో జరిగే ప్రజాయుద్ధ నౌక గద్దర్ 3వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ.. రామాయంపేట మున్సిపల్ కేంద్రంగా తెలంగాణ ఉద్యమకారుల క్యాంప్ ఆఫీస్ ఆవరణలో ప్రజాయుద్ధ నౌక గద్దర్ 3 వ వర్ధంతి సభ పోస్టర్ లను తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా అధ్యక్షులు గుండా ( దాస్)ఎల్లం ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తన 60 ఏండ్ల జీవితాన్ని ప్రజలకు, ప్రజా యుద్ధానికి, పీడిత ప్రజల విముక్తి కోసం అంకితం చేసి, ప్రజలకు తన పాటను అంకితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ భౌతికంగా దూరమై మూడేళ్లు గడుస్తున్నాయని అన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు, బోధించిన అంశాలు, ఆయన పాట ఇంకా ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని అన్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్కు మరణం లేదని, ఆయన తెలంగాణ ప్రజల కోసం ఎనలేని పోరాటం చేశాడని అన్నారు.ఆయన ఆశయాలను కొనసాగించడం కోసం గద్దర్ కుమారుడు సూర్యం ఆధ్వర్యంలో గద్దర్ ఫౌండేషన్ ఏర్పడిందని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 6న హైదరాబాద్ రవీంద్రభారతిలో సాయంత్రం 4 గంటలకు వర్ధంతి సభజరుగుతుందని, ఈ సభను విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు గంగా రాములు, మాజీ ఎంపీటీసీ మైలారం బిక్షపతి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మాసాయిపేట మల్లేశం,DBF జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్ టిఆర్ఎస్ నిజాంపేట అధ్యక్షులు నాగరాజు, నగేష్ యాదవ్, మోహన్ రెడ్డి, కోనేరు శ్రీనివాస్, మాల మహానాడు మండల అధ్యక్షులు బైరం సిద్దరాములు, నక్క శ్రీనివాస్, పుట్టి సిద్దరాములు, నందిగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి గ్రామానికి నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు

- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**
- **మిషన్ భగీరథ నీటి సరఫరాలో జాప్యానికి తావివ్వొద్దు**

**గుమ్మడిదల, ఆగష్టు 5 (సిరి న్యూస్):**

మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ఆదేశించారు. బుధవారం మిషన్ భగీరథ సహాయ ఇంజనీర్ (ఏఈ) శివప్రసాద్‌తో ప్రత్యేక సమీక్ష నిర్వహించి గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితులు, నిర్వహణ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పైప్‌లైన్లలో లీకేజీలు, మోటార్ల లోపాలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, ప్రతి గ్రామానికి నిర్ణీత సమయానికి నాణ్యమైన తాగునీరు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, నాయకులు జయశంకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం

- **తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గుమ్మడిదలలో అవగాహన కార్యక్రమం**

**గుమ్మడిదల, ఆగస్టు 5 (సిరి న్యూస్):**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుమ్మడిదల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఎస్. మధుకర్ ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యత, తల్లి–శిశువు ఆరోగ్యంపై వాటి ప్రభావాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని, పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం ద్వారా పిల్లలు అనేక అంటువ్యాధులు, పోషకాహార లోపాల నుంచి రక్షణ పొందుతారని తెలిపారు. తల్లిపాలు ఎంతకాలం అందిస్తే అంతకాలం శిశువు ఆరోగ్యంగా ఎదిగే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు తగ్గుతుందని వివరించారు. తల్లి తన బిడ్డకు పాలిచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిడ్డకు తల్లిపాలు సరిపోతున్నాయో లేదో గుర్తించే విధానాలను కూడా ఆయన వివరించారు. శిశువు ఆరు నెలలు పూర్తయ్యాక ఆహారాన్ని తప్పనిసరిగా ప్రారంభించాలని పూజించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం పోషకాహారం ప్రయోజనాలను తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ మంజుల, ఏఎన్ఎం స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, గిరిజ, మంగమ్మ, గర్భిణీలు, పాలింతలు, మహిళలు పాల్గొన్నారు.





# జీపీఎల్ విజేతగా 'బుల్స్' జట్టు





- **వరుసగా రెండోసారి టైటిల్ కైవసం**
- **రన్నరప్‌గా 'గుమ్మడిదల ఫైటర్'**
- **ఉత్కంఠగా సాగిన గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ**

**గుమ్మడిదల, ఆగస్టు 5 (సిరి న్యూస్):**

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో నిర్వహించిన గుమ్మడిదల ప్రీమియర్ లీగ్ (జీపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. పలువురు క్రీడాభిమానుల సమక్షంలో జరిగిన ఫైనల్ పోరు ఉత్కంఠభరితంగా సాగగా, నరేష్ సారథ్యంలో బరిలోకి దిగిన 'బుల్స్' జట్టు అద్భుత ఆటతీరుతో వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. టోర్నీలో మొత్తం నాలుగు జట్లు పాల్గొని 12 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ప్రతి మ్యాచ్ ఆసక్తికరంగా సాగి ప్రేక్షకులను అలరించింది. లీగ్ దశ నుంచి ఫైనల్ వరకు క్రీడాకారులు కనబరిచిన పోరాట పటిమ, సమన్వయం, క్రీడా నైపుణ్యం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో రాము నాయకత్వంలోని గుమ్మడిదల ఫైటర్ జట్టు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. విజేత జట్టు క్రమశిక్షణతో కూడిన ఆటతీరును ప్రదర్శిస్తూ వరుసగా రెండో ఏడాది టైటిల్‌ను నిలబెట్టుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు, యువతను ఆరోగ్యకరమైన క్రీడల వైపు మళ్లించేందుకు జీపీఎల్ టోర్నీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో పోటీలను నిర్వహించి యువ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.ఈ టోర్నీని స్వప్నిల్, పవన్ చంద్ర ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. పోటీల ముగింపు సందర్భంగా విజేతలు, రన్నరప్ జట్లను అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలను అభినందించారు.

## తప్పుడు పత్రాలతో పాఠశాలా.?..

- **తప్పుడు పత్రాలతో అనుమతులా.?..**
- **కాకతీయ పాఠశాల సీజ్ చేయాలి.!..**
- **అధికారులపై విచారణ జరపాలి.!..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05 (సిరి న్యూస్)**

తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆధారంగా నిర్వహణ అనుమతులు పొందిందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న మందమర్రి మండలంలోని గద్దరాగడి ప్రాంతం కాకతీయ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు రుజువైతే వెంటనే పాఠశాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నేషనలిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ (ఎన్ఎస్సీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం మందమర్రి మండల కేంద్రంలో ఎన్ఎస్సీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్సీ జిల్లా అధ్యక్షుడు బచ్చలి అభిరామ్ మాట్లాడుతూ, కాకతీయ పాఠశాలకు సంబంధించి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించకుండానే విద్యాశాఖ అధికారులు నిర్వహణ అనుమతులు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అగ్నిమాపక శాఖ నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో తిరస్కరించబడినట్లు కనిపిస్తున్నప్పటికీ, దానిని పట్టించుకోకుండా అధికారులు అనుమతులు ఎలా మంజూరు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యం సమర్పించిన అన్ని శాఖల నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలపై ఉన్నతస్థాయి కమిటీతో వెంటనే విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణలో పత్రాలు తప్పుడు అని తేలితే సంబంధిత యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని ఎన్ఎస్సీ తరఫున ప్రభుత్వాన్ని కోరారు.

## అర్హులందరికీ సంక్షేమం.. మంత్రి ఆదేశం!..

- **అర్హులందరికీ సంక్షేమం..**
- **అధికారులకు కీలక ఆదేశాలు..**
- **అభివృద్ధికి వేగం..**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 05 (సిరి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన అర్హులందరికీ చేరడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ ఫలాలు ఆలస్యం కాకుండా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. చెన్నూర్ శాసనసభ్యుడి శిబిర కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సమక్షంలో కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్ మండలాల అధికారులతో మంత్రి గడ్డం వివేకానంద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ప్రజలకు అందుతున్న సేవలపై శాఖల వారీగా సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత



**వెల్దుర్తి, ఆగస్టు 05,(సిరి న్యూస్ ):**

మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన గ్రామస్తులు, యువకులు, ప్రజాప్రతినిధులు,అన్ని రాజకీయ పార్టీ నాయకులు బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. శివంపేట మండలంలో అధికారిక కార్యక్రమంలో హాజరైన ఎమ్మెల్యేను కలిసి మండలంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి మండల కేంద్రం లోనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్పందిస్తూ వెల్దుర్తి మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు కావడం ఎంతో శుభదాయకమని, అలాగే ఇట్టి స్కూళ్ళు మండల కేంద్రంలోనే నిర్మించుట కోసం తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు యువకులు,హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇసుక వేలం పాట రూ.2.18 లక్షలు

- 30 ట్రిప్పుల విక్రయం.
- దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు కు దక్కిన ఇసుక వేలం.
- అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు.
- రామాయంపేట తహసిల్దార్ రజనీకుమారి.



**రామాయంపేట, ఆగస్టు 5 (సిరి న్యూస్)**

అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా రామాయంపేట తహశీల్దార్ రజనీకుమారి హెచ్చరించారు. బుధవారం రామయంపేట తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక వేలంపాటను నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 30 ట్రిప్పుల ఇసుకను వేలానికి ఉంచగా, తొమ్మిది మంది పాల్గొని పోటీపడి వేలం పాడారు. చివరకు అత్యధికంగా రూ.2.18 లక్షలకు దంతపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు వేలం దక్కించుకుని ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రజనీ కుమారి మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ఇసుకను వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ అవసరాలు, ప్రజా ప్రయోజన పనులకే ఇసుకను ఉపయోగించాలని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకం, అక్రమ రవాణా, నిల్వ లేదా విక్రయాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంతో పాటు సహజ వనరుల పరిరక్షణ కోసం ఇలాంటి పారదర్శక వేలంపాటలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేలంపాట ప్రక్రియ ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం ముగిసింది.

## బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జనార్దన్ రెడ్డి నియామకం



**వెల్దుర్తి,ఆగస్టు 05,(సిరి న్యూస్ ):**

బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ ముదిరాజ్ జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండలం నుంచి సీనియర్ నాయకులు పార్టీకి చేసిన సేవలను గుర్తించి మూడవ సారి అవకాశాన్ని కల్పించి బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిన్నంగారి జనార్ధనరెడ్డి ఎన్నుకోవడం జరిగింది. అనంతరం జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతం కోసం, జాతీయవాద సిద్ధాంతం కోసం గత నలభై సంవత్సరాలుగా ఎవరున్నా లేకున్నా పనిచేస్తున్న నాయకులను ఈరోజు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గంలో తీసుకోవడం జరిగింది అని వారు అన్నారు. పార్టీ సిద్ధాంతం కోసం పనిచేస్తూ వెల్దుర్తి మండలం అలాగే జిల్లాలో స్వచ్ఛందంగా పనిచేస్తూ రైతులకు నిస్వార్థంగా సేవ చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని వారు అన్నారు. మండల అధ్యక్షుడు పడిగే దాసు మాట్లాడుతూ ఇటువంటి సీనియర్ నాయకులని యువత ఆదర్శంగా తీసుకుని రాబోయే రోజుల్లో భారతీయ జనతా పార్టీలో చేరి దేశం కోసం జాతీయ వాద సిద్ధాంతం, అన్నీ వర్గాల ప్రజా సమస్య పరిష్కారం కోసం పని చేయాలని అని.. రాబోయే రోజుల్లో రైతుల సమస్యల పైన అహర్నిషం కొట్లాడి పరిష్కారం చేస్తామని తెలియజేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె వెంకటేశం,యాదగిరి ముదిరాజ్,నాయకులు కార్యకర్తలు ,తదితరులు పాల్గొనారు.

## 48 సంవత్సరాల తర్వాత కలిసిన స్నేహితులు



**పటాన్ చెరు/జోగిపేట, ఆగస్టు 5, (తెలంగాణ వాణి);**

వారంతా 1977–78 లో జోగిపేట ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి చదువుకున్న స్నేహితులు. ప్రస్తుతం వారు వివిధ రంగాల్లో స్థిర పడ్డారు. దాదాపు 38 ఏళ్ల తర్వాత బుధవారం నాడు జోగిపేట కు సమీపంలోని పిరగారి వెంకటేశ్వర్లు వ్యవసాయ క్షేత్రం లో కలుసుకున్నారు. ఒకరి కష్ట సుఖాలు ఇంకొకరు అడిగి తెలుసుకుని రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అక్కడే వంట వార్పు చేసుకుని భోజనం చేసి పాత విషయాలు గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇదే బ్యాచ్ కి చెందిన వారి మిత్రుడు పడిగే సత్యం జోగిపేట చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గా ఎన్నికైన విషయం తెలుసుకుని అతడును శాలువ పూల దండల తో ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో సత్యం తో పాటు అలనాటి మిత్రులు కే వి రవీందర్, బాణాల మధు, మధుసూదన్, రాజేందర్, జగన్మోహన్ రెడ్డి, మనోహర్ ప్రసాద్, పిరగారి వెంకటేశ్వర్లు, కృష్ణా, నాగేశ్వర్ రావు, సుదర్శన్ గౌడ్, అమర్నాథ్, రాచకొండ వెంకటేశం, రంగ సురేష్, పెండ్యాల రాములు, రెవెల్ల మల్లేశం,, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి





- స్కూల్, హాస్పిటల్ ఫీజుల్లో రాయితీకి చర్యలు.
- ప్రెస్ క్లబ్ భవనంలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక.
- వివాదాలకు తావులేకుండా కలిసికట్టుగా పనిచేద్దాం.
- మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివన్నగారి నరసింహ చారి.

**మెదక్ ఆగష్టు,05(సిరి న్యూస్)**

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా మెదక్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని మెదక్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు శివన్నగారి నరసింహ చారి తెలిపారు. బుధవారం మెదక్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఎన్నికల కమిషన్ సభ్యులు మంగ శరత్ గౌడ్, భువనగిరి శేఖర్, అల్లాడి శేఖర్, యూసఫ్, పొగాకు రామకృష్ణ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడుగా నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి బచ్చు సంగమేశ్వర్ పదవీ బాధ్యతలు స్వీకరించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు నరసింహ చారి మాట్లాడుతూ.. మెదక్ ప్రెస్ క్లబ్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దేందుకు పటిష్టమైన ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ భవనంలో కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడించారు. ప్రతి జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల్లో, వారి కుటుంబ సభ్యులకు హాస్పిటల్ బిల్లుల్లో రాయితీలు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు, ఐఎంఏ ప్రతినిధులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల వరకు మాత్రమే గ్రూపులు ఉన్నాయని, ఇకపై ఎలాంటి విభేదాలకు తావులేకుండా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రెస్ క్లబ్ నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, సమిష్టి నిర్ణయాలతో బాధ్యతలను నిర్వర్తిస్తామని స్పష్టం చేశారు.

### నూతన కార్యవర్గం

అధ్యక్షుడు– శివన్నగారి నరసింహ చారి, ప్రధాన కార్యదర్శి – బచ్చు సంగమేశ్వర్, కోశాధికారి – చెవిటి అశోక్, గౌరవ అధ్యక్షులు – కామటి కృష్ణ, గోపాల్ గౌడ్, కార్యనిర్వహక అధ్యక్షుడు – వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు – రియాజుద్దీన్, నీలం, ఫసియొద్దిన్, వారాల శ్రీకాంత్, శ్రీహరి గౌడ్, సంయుక్త కార్యదర్శులు – రాజా గౌడ్, మల్లేశం, సిద్ధేశం, ఫణిరాజ్, కార్తీక్, కార్యనిర్వహక కార్యదర్శి – ఎం.డి. రహమత్ అలీ, ప్రచార కార్యదర్శి – ఆర్. సందీప్, గౌరవ సలహాదారులు – శ్రీధర్, ఫారుక్ హుస్సేన్, హరినాథ్, కార్యవర్గ సభ్యులు – చింతల రమేష్, రాద్య లక్ష్మణ్, చల్ల రాహుల్, టి. సుభాష్, మల్లికార్జున్. ఈ కార్యక్రమంలో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు బాలేశ్వర్ రావు , మురళి, వికాస్, లక్ష్మీనారాయణ, ముచ్చ నవీన్, సురేందర్ రెడ్డి, కానుగు పరశురామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







# సైబర్ నేరాలపై అప్రమత్తం.!..

- సైబర్‌మోసాలపైవిద్యార్థులకు పోలీసులహెచ్చరిక..
- అనుమానాస్పదలింక్‌లకు దూరంగాఉండాలంటూ అప్రమత్తం..

**మంచిర్యాలజిల్లాప్రతినిధిఆగస్టు05(సిరిన్యూస్)**

డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు మందమర్రి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక మదర్ తెరెసా ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి గోప్యమైన వివరాలను ఎవరికీ ఇవ్వొద్దని హెచ్చరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు ప్రధాన ఆయుధమని వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఉప పరిశీలకుడు మల్లేష్, కానిస్టేబుళ్లు సంతోష్, విశ్వనాథ్, సురేందర్, హోంగార్డు శ్రావణ్ కుమార్, పాఠశాల డైరెక్టర్ బరిగెల సతీష్, బబ్బెర లక్ష్మణ్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# మండల కేంద్రంలో పశువైద్యులే కరువు..!

- వైద్యం అందక బర్రె మృతి
- రూ.60 వేల విలువైన పాడిపశువు కోల్పోయిన రైతు..
- అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆవేదన
- మండల కేంద్రంలోనే వైద్యులు అందుబాటులో ఉండాలని రైతుల డిమాండ్

**శివ్వంపేట, ఆగస్ట్ 5 (సిరి న్యూస్ ):**



మండల కేంద్రంలో పశువైద్యులు అందుబాటులో లేకపోవడంతో సమయానికి చికిత్స అందక ఓ రైతు విలువైన బర్రె మృతి చెందిన ఘటన శివ్వంపేటలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాడిపశువులే జీవనాధారంగా ఉన్న రైతులకు పశువైద్య సేవలు సకాలంలో అందకపోవడం వల్ల భారీ నష్టాలు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శివ్వంపేట గ్రామానికి చెందిన రైతు రాములుకు చెందిన సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల విలువైన బర్రె అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైంది. పరిస్థితి విషమించడంతో వెంటనే పశువైద్యులకు సమాచారం ఇచ్చినా, వారు సమయానికి రాకపోవడం వల్ల సరైన చికిత్స అందక మృతి చెందినట్లు రైతు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో రైతు కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.రైతుల వివరాల ప్రకారం , శివ్వంపేట మండల కేంద్రంలో విధులు నిర్వహించాల్సిన పశువైద్యులు ఎక్కువగా గోమారం గ్రామంలోనే ఉంటూ, మండల కేంద్రానికి సకాలంలో రావడం లేదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడం, లీవ్ లో ఉన్నామంటూ తప్పించుకుంటూ వచ్చిన ఆలస్యంగా రావడం వల్ల మూగజీవాల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని రైతులు వాపోయారు.పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులకు ఒక్కో పశువు కుటుంబ సభ్యుడిలాంటిదేనని, దాని మరణం ఆర్థికంగా, మానసికంగా తీవ్ర దెబ్బ అని పేర్కొన్నారు. పాలు, దూడలు, వ్యవసాయ పనులకు ఉపయోగపడే పశువులు ఇలా నిర్లక్ష్యం కారణంగా మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు."నా కళ్ల ముందే బర్రె చనిపోయింది" – రైతు రాములు ఈ సందర్భంగా రైతు రాములు మాట్లాడుతూ, "నా బర్రె ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. వెంటనే పశువైద్యుడికి సమాచారం ఇచ్చాం. చాలాసేపు ఎదురుచూశాం. సమయానికి డాక్టర్ వచ్చి చికిత్స చేసి ఉంటే నా బర్రె బతికేది. రూ.60 వేల విలువైన పశువును కోల్పోయాను. ఇది నాకు తీరని నష్టం. మండల కేంద్రంలో డాక్టర్ ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. మాలాంటి రైతుల కష్టాన్ని అధికారులు గుర్తించి శివ్వంపేటలోనే పశువైద్యులను అందుబాటులో ఉంచాలి" అని కన్నీటి పర్యంతమయ్యారు.మరో రైతు మాట్లాడుతూ, "పశువులకు అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు ప్రతి నిమిషం విలువైనది. కానీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అమాయక మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి" అని కోరారు.గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ, మండల కేంద్రంలో 24 గంటల అత్యవసర పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# ఆరోగ్యాన్ని అందించే 'రైతు వారధి'

ఈ మధ్యకాలంలో మనం తినే ఆహార పదార్థాల్లో చాలావరకు కల్తీ అవుతున్నాయని వార్తలు వస్తున్నాయి. రోజుకో ప్రొడక్ట్ కల్తీ అని తెలుస్తోంటే.. గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఎంతో ఇష్టంగా తినే ఫుడ్ కల్తీ కావడం వల్లే మన దేశంలో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారని నిపుణులు చెప్తున్నారు. అందుకే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని నమ్మిన ఒక యువరైతు ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించడానికి సిద్ధమయ్యాడు. తోటి రైతులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. బీటెక్ చదివి తోటి రైతులకు సాగు పాఠాలు నేర్పుతున్న క్యాస మధు స్టోరీ ఇది.



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికేపల్లికి చెందిన మధు.. బీటెక్ అయిపోగానే కొంతకాలం ఉద్యోగం చేశాడు. తర్వాత ఉద్యోగం మానేసి తిరిగి ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి రీసెర్చ్ చేశాడు. వ్యవసాయాధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకునేవాడు. అంతేకాకుండా యూట్యూబ్‌లో వీడియోల్లో చూసి సేంద్రియ సాగులో మెళకువలు నేర్చుకునేవాడు. అలా ఇప్పుడు తను వాళ్ల పొలంలో పూర్తిగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న వ్యవసాయ భూమిలో సేంద్రియ సాగు మొదలుపెట్టాడు. అలా పండిన పంటలను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా కస్టమర్లకు అమ్ముతున్నాడు. అందుకోసం 'రైతు వారధి'ని ఏర్పాటు చేశాడు. దీని ద్వారా రైతులకు, కస్టమర్లకు మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాడు. సేంద్రియ పద్ధతిలో పండించిన పప్పుదినుసులు, పసుపు, కూరగాయలతోపాటు కారంపొడిని అమ్ముతున్నాడు. వీటితో పాటు గానుగ నూనె, పచ్చళ్లు కూడా హోమ్ డెలివరీ చేస్తున్నాడు.

ప్రస్తుతం దాదాపు 70 శాతం మంది రైతులు దొడ్డు రకం బియ్యం పండిస్తుండగా, 30 శాతం మంది మాత్రమే సన్నరకాలు పండిస్తున్నారు. కానీ, సన్న రకాలకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో కొందరు రైతులు ఎక్కువ దిగుబడి కోసం రసాయనాలు వాడుతున్నారు. అయితే, దానివల్ల అనారోగ్యాలు వస్తాయని మధు మిగతా రైతులకు అర్థమయ్యేలా వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నాడు.

### ఎలా మొదలైందంటే..

కొన్నేండ్ల నుంచి అధిక దిగుబడుల కోసం చాలామంది రైతులు విపరీతంగా రసాయనాలు వాడారు. ఇప్పటికీ వాడుతున్నారు. కానీ.. కరోనా వల్ల చాలామంది మంచిఫుడ్ తింటేనే ఆరోగ్యంగా ఉంటామని తెలుసుకున్నారు. ఆరోగ్యకరమైన పద్ధతుల్లో పండించిన ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ.. అలాంటి ఆహార ధాన్యాలు మార్కెట్‌లో సరిగ్గా దొరకడం లేదు. కొందరు రైతులు కష్టపడి సేంద్రియ పద్ధతుల్లో పండించినా అవి కస్టమర్ వరకు చేరేలోపే కల్తీ అవుతున్నాయి. అందుకే కెమికల్స్ లేని పంటలు పండించి, వాటిని నేరుగా కస్టమర్లకు చేర్చాలి అనే ఆలోచనతో మొదలైంది మధు ప్రయాణం.

"ప్రస్తుతం జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఈ సర్వీస్‌లు అందిస్తున్నాడు. సేంద్రియ వ్యవసాయంలో ఖర్చు చాలా తక్కువ. కానీ.. లాభాలు ఎక్కువగా వస్తాయి. పైగా సరైన పద్ధతుల్లో పండిస్తే దిగుబడి కూడా బాగానే వస్తోంది. సేంద్రియ ఉత్పత్తుల వల్ల రైతుతో పాటు ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారు" అని చెప్తున్నాడు మధు.








# ఇంగువ వల్ల ఎన్ని లాభాలో!

కొన్ని రకాల భారతీయ వంటల్లో ఇంగువ వాడడం సహజం. ముఖ్యంగా పులిహోర లాంటి వంటలకు ఇంగువ లేకపోతే రుచే లేదు. రుచితో పాటూ ఇంగువ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని తెలుసా? ఇప్పుడు తెలుసుకుందాం.

ఇంగువలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అంటువ్యాధులను నివారించడానికి ఉపయోగపడతాయి. ఏదైనా గాయం అయితే తొందరగా నయం చేయడానికి సాయపడతాయి.

ఒక అధ్యయనం ప్రకారం, ఇంగువను ఆయుర్వేద వైద్యంలో వివిధ ఆరోగ్య ప్రయోజనాల కోసం చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు కూడా. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. దీనికున్న క్షార స్వభావం వల్ల కడుపులో అసిడిటీని, యాసిడ్ రిఫ్లక్స్‌ను తగ్గిస్తుంది.

### ఆడవాళ్లకు ఇలా..

ఫేస్ ప్యాక్స్ లో చిటికెడు ఇంగువ వేసుకుని ముఖానికి రాసుకుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.ఇంగువలోని రోగ నిరోధక లక్షణాలు నెలసరి సమయంలో వచ్చే నొప్పులు, ఇతర పిఎంఎస్ లక్షణాల నుండి ఉపశమనం ఇవ్వ డానికి సాయం చేస్తాయి. పీరియడ్స్ సమయంలో అధిక రక్తస్రావం కాకుండా కంట్రోల్ చేస్తుంది.

# ఎవర్‌గ్రీన్ కాంబినేషన్

వర్షం కురిసే వేళ... వేడిగా పొగలు కక్కుతున్న టీ ఉంటే... అద్భుతః అనిపిస్తుంది. ఈ ఎవర్‌గ్రీన్ కాంబినేషన్ మాన్‌సూన్‌లో తప్పక ట్రై చేయాల్సిందే. కానీ, ఇందులో స్పెషాలిటీ ఏంటంటే... మామూలు టీ కాదు.. అల్లం, పుదీనా, తులసి వంటి వాటితో టీ పెట్టుకుని తాగితే.. వానాకాలంలో వేధించే దగ్గు, జలుబు, తలనొప్పి, ముక్కుదిబ్బడ, గొంతులో గరగర వంటి సమస్యలన్నింటికి చెక్ పెట్టొచ్చు. మరింకేం.. ఈ టీలు ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందామా.



### అల్లం టీ



**కావాల్సిన పదార్థాలు:**

అల్లం – ఒక టీస్పూన్
తేనె – రెండు స్పూన్లు
లవంగాలు – రెండు
దాల్చిన చెక్క – 1అంగుళం
నీళ్లు – ఒక కప్పు

**తయారీ విధానం:**

ఒక గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి మరిగించాలి. తర్వాత అందులో అల్లం, తేనె, లవంగాలు, దాల్చిన చెక్కలను వేయాలి. ఆ నీటిని పావుగంట పాటు పక్కన పెట్టాలి. ఆపై ఒక కప్పులో టీని వడకట్టి ఈ గోరువెచ్చగా తాగాలి.

### తులసి టీ



**కావాల్సిన పదార్థాలు:**

తులసి ఆకులు – పావు కప్పు
తేనె – ఒక టీస్పూన్
నిమ్మరసం – రెండు టీస్పూన్లు
నీళ్లు – పావు కప్పు

**తయారీ విధానం:**

ఒక గిన్నెలో నీళ్లు పోసి అందులో తులసి ఆకులు వేసి మరిగించాలి. ఆ తర్వాత ఈ నీటిని ఒక కప్పులో వడకట్టాలి. ఆపై తేనె, నిమ్మరసం కలుపుకొని గోరువెచ్చగా ఉన్నప్పుడే ఆస్వాదిస్తే.. ఆ అనుభూతే వేరు.

### పుదీనా టీ



**కావాల్సిన పదార్థాలు:**

పుదీనా ఆకులు – కొన్ని
రోజ్‌మేరీ రెమ్మ – ఒకటి
నిమ్మరసం – రుచికి సరిపడా
నీళ్లు – ఒక కప్పు

**తయారీ విధానం:**

ముందుగా ఒక గిన్నెలో నీళ్లు పోసి మరించాలి. అందులో రోజ్‌మేరీ వేసి ఉడికించాలి. మరోవైపు ఒక కప్పులో పుదీనా ఆకులను వేయాలి. ఆ తర్వాత రోజ్‌మేరీ మిశ్రమాన్ని పుదీనా ఆకులు ఉన్న కప్పులో పోయాలి. పది నిమిషాలు అలాగే ఉంచి.. చివరగా నిమ్మరసం వేసుకుని తాగితే.. టేస్ట్ బాగుంటుంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

# రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు

## 83 కిలోమీటర్ల మేర అందుబాటులోకి రానున్నకొత్త రోడ్లు

- త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కసరత్తు
- అధికారులతో సమీక్షించిన జగ్గారెడ్డి, నిర్మల

సంగారెడ్డి, ఆగస్టు 5 (సిరి న్యూస్): సంగారెడ్డి నియోజకవర్గంలో 83 కిలోమీటర్ల పొడవున రోడ్లను నిర్మించేందుకు రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల తెలిపారు. పనులు త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు.

2




www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

గురువారం


ఆగస్టు-06-2026

సంపుటి (Volume) : 2

సంచిక (Issue) 207

MEDAK, SANGAREDDY, SIDDIPET

పేజీలు : 4






# ఒకే రకమైన పనులు..

# లెక్కల్లో తేడాలు!





## నిధుల ఖర్చులో వైవిధ్యం.. ఎంబీ రికార్డులే కొలమానమా?

- కోనాపూర్ సొసైటీలో పది షెట్టర్లకు రూ.52 లక్షలు
- కొత్తపల్లిలో నాలుగు షెట్టర్లకే ఏకంగా సుమారు రూ.30 లక్షలు
- ఒకే శాఖ.. ఒకే తరహా నిర్మాణ పనులు
- వివిధ సహకార సంఘాల్లో భిన్నమైన ఖర్చుల అంచనాలు
- ఎస్టిమేషన్స్ వేస్తే ఎక్కువ మొత్తంలో పెరిగిన వ్యయం
- సొంత అంచనాలతో తక్కువ ఖర్చుకే పూర్తయిన నిర్మాణాలు
- కేవలం ఎంబీ రికార్డులు చేయకపోవడమే ఇక్కడ వివాదమా
- పెట్రోల్ పంపు మౌలిక వసతులకు రూ.69 లక్షలు

సహకార శాఖ పరిధిలోని వివిధ ప్రాథమిక సహకార సంఘాల్లో జరిగిన నిర్మాణ పనుల వ్యయాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒకే శాఖ ఆధ్వర్యంలో ఒకే తరహా నిర్మాణాలు చేపట్టినప్పటికీ, వేర్వేరు సొసైటీల్లో ఖర్చు అయిన నిధుల వ్యత్యాసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. అధికారిక ఇంజనీరింగ్ ఎస్టిమేషన్ల ప్రకారం పనులు చేపట్టిన చోట భారీగా ఖర్చు కాగా, ఎస్టిమేషన్లు లేకుండా ప్రాక్టికల్ విధానంలో పూర్తి చేసిన చోట వ్యయం గణనీయంగా తగ్గడం గమనార్హం.

3

(నిఘా విభాగం-సిరి న్యూస్)



# ఆర్జిన్ స్కూల్‌లో తైక్వాండో సందడి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం: ఆర్జిన్ స్కూల్ చైర్మన్ ప్రమోద్ కుమార్

4





## సరోజినీ నగర్ మహిళలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే లక్ష్యం

2

ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ సైదా నాయక్

# పురపాలికల అభివృద్ధికి ముందడుగు!

- కలెక్టర్ చొరవతో సాగనున్న అభివృద్ధి పనులు
- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు, కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు
- సమస్యలు పరిష్కారమవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





మెదక్, ఆగస్టు 5 (సిరి న్యూస్): మెదక్ పట్టణంలో టీయూఎఫ్ఐడీ, యూఐడీఎఫ్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పలు వార్డుల్లో కేవలం శంకుస్థాపన దశలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. పెండింగ్ పనులు, సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

4

# రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు

- త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కసరత్తు
- అధికారులతో సమీక్షించిన జగ్గారెడ్డి, నిర్మల

## 83 కిలోమీటర్ల మేర అందుబాటులోకి రానున్న కొత్త రోడ్లు

**సంగారెడ్డి, ఆగస్టు 5 (సిరి న్యూస్) :** సంగారెడ్డి నియోజకవర్గంలో 83 కిలోమీటర్ల పొడవున రోడ్లను నిర్మించేందుకు రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల తెలిపారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. ఈ అంశమై ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం పాడైపోయిన రోడ్లను బాగు చేసేందుకు రెన్యువల్ కూడా చేయించలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో వేసిన రోడ్లనే ఇప్పటికీ ప్రజలు ఉపయోగిస్తున్నారని, మరమ్మతులకు గురికావడంతో పదేళ్లుగా పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రధాన మార్గాలను, గ్రామాలను, మండల కేంద్రాలను, పట్టణాలను కలిపేలా రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొత్తగా కావాల్సిన కొన్ని రోడ్లు, గతంలో పూర్తి చేసి పెండింగులో ఉన్న బిల్లులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. పెండింగ్ బిల్లులను వెంటనే ఇప్పించేలా తాను సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి మాట్లాడతానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

### ఆర్అండ్ బీ రోడ్లను బాగు చేయనున్నారిలా

జాతీయ రహదారి 65 నుంచి వయా లక్డారం, బ్యాతోల్ మీదుగా ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామం వరకు 6.20 కిలోమీటర్ల మేర కొత్త రోడ్డు వేయనున్నారు. జాతీయ రహదారి 65 నుంచి పరివార్ దాబా వద్ద ప్రారంభమై ఇస్మాయిల్ ఖాన్ పేట వరకు 6.50 కిలోమీటర్ల మేర రోడ్డు వేయనున్నారు. పెద్దాపూర్ నుంచి అనంత్ సాగర్ వయా తొగర్ పల్లి, అలియాబాద్, కొండాపూర్, మారేపల్లి వరకు 16.10 కిలోమీటర్ల మేర రోడ్డును బాగు చేయనున్నారు.



# సరోజినీ నగర్ మహిళలకు గౌరవప్రదమైన జీవితం కల్పించడమే లక్ష్యం

## ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ సైదా నాయక్

రామాయంపేట, (నార్సింగి) ఆగస్టు 5 (సిరి న్యూస్) తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ వృత్తి నుంచి సరోజినీ నగర్ మహిళలను బయటకు తీసుకు వచ్చి, వారికి గౌరవప్రదమైన జీవితం, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట సీఐ సైదా నాయక్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నార్సింగి మండలం జప్తి శివునూర్ సరోజినీ నగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలు, వారి కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి కూడా పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ వృత్తిని పూర్తిగా విడిచిపెట్టి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆత్మగౌరవంతో జీవించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మహిళలు తమకు గతంలో ప్రభుత్వం కేటాయించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నందున జీవనోపాధి కోల్పోయామని, ఆ పరిస్థితుల వల్లే మళ్లీ పాత వృత్తిని కొనసాగించాల్సి వచ్చిందని అధికారులకు వివరించారు. తమకు భూములను తిరిగి కేటాయించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తే వృత్తిని పూర్తిగా విడిచిపెడతామని విజ్ఞప్తి చేశారు. మహిళల సమస్యలను ఓర్పుగా విన్న డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ సైదా నాయక్ సంబంధిత శాఖలతో సమన్వయం చేసి వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయంపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. సరోజినీ నగర్ మహిళల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఎస్ఐ సృజన, నిజాంపేట ఎస్సై రాజేష్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

















# ఒకే రకమైన పనులు..
# లెక్కల్లో తేడాలు!

## నిధుల ఖర్చులో వైవిధ్యం.. ఎంబీ రికార్డులే కొలమానమా?

- కోనాపూర్ సొసైటీలో పది షెట్టర్లకు రూ. **52** లక్షలు
- కొత్తపల్లిలో నాలుగు షెట్టర్లకే ఏకంగా సుమారు రూ. **30** లక్షలు
- ఒకే శాఖ.. ఒకే తరహా నిర్మాణ పనులు
- వివిధ సహకార సంఘాల్లో భిన్నమైన ఖర్చుల అంచనాలు
- ఎస్టిమేషన్స్ వేస్తే ఎక్కువ మొత్తంలో పెరిగిన వ్యయం
- సొంత అంచనాలతో తక్కువ ఖర్చుకే పూర్తయిన నిర్మాణాలు
- కేవలం ఎంబీ రికార్డులు చేయకపోవడమే ఇక్కడ వివాదమా
- పెట్రోల్ పంపు మౌలిక వసతులకు రూ. **69** లక్షలు

సహకార శాఖ పరిధిలోని వివిధ ప్రాథమిక సహకార సంఘాల్లో జరిగిన నిర్మాణ పనుల వ్యయాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒకే శాఖ ఆధ్వర్యంలో ఒకే తరహా నిర్మాణాలు చేపట్టినప్పటికీ, వేర్వేరు సొసైటీల్లో ఖర్చు అయిన నిధుల వ్యత్యాసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. అధికారిక ఇంజనీరింగ్ ఎస్టిమేషన్ల ప్రకారం పనులు చేపట్టిన చోట భారీగా ఖర్చు కాగా, ఎస్టిమేషన్లు లేకుండా ప్రాక్టికల్ విధానంలో పూర్తి చేసిన చోట వ్యయం గణనీయంగా తగ్గడం గమనార్హం.

(నిఘా విభాగం-సిరి న్యూస్)

### సొసైటీ ఆస్తుల కల్పనలో ఖర్చుల వివరాలు..

కోనాపూర్ సొసైటీలో 2013-14లో పొడవు 30 ఫీట్లు, వెడల్పు 12 ఫీట్లు, ఎత్తు 13 ఫీట్లు (పుట్టింగ్స్ నుంచి రోడ్డుపైకి బీమ్ కాకుండా 6 ఫీట్ల ఎత్తు) కలిగిన 6 షాపుల నిర్మాణానికి సుమారు రూ. 31 లక్షలు ఖర్చయింది. ఆ తర్వాత 2015 నుంచి 2018 వరకు పెట్రోల్ పంప్ నిర్మాణం, ఆఫీస్ బిల్డింగ్, అదనపు వాష్‌రూమ్స్, పంపుకు కావలసిన మౌలిక వసతులు, పర్మిషన్లు, డీడీలు అన్నింటికీ కలిపి సుమారు రూ. 69 లక్షల వ్యయం అయింది.

### కోనాపూర్, కొత్తపల్లి సొసైటీల పోలిక

కోనాపూర్ సొసైటీలో మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి అధ్యక్షతన 2017 నుంచి 2019 మధ్య కాలంలో హనుమాన్ మందిరం రోడ్డు వద్ద 10 షాప్ షెట్టర్ల నిర్మాణం చేపట్టారు. లోపలి సైజు పొడవు 30 ఫీట్లు, వెడల్పు 12 ఫీట్లు, ఎత్తు 13 ఫీట్లతో నిర్మించిన ఈ పది పెద్ద షెట్టర్లకు సుమారు రూ. 52 లక్షలు మాత్రమే ఖర్చయింది. అదే సమయంలో పాపన్నపేట మండలం కొత్తపల్లి సొసైటీలో ఇంజనీర్ ఎస్టిమేషన్ ద్వారా ఎంబీ రికార్డు చేసి కేవలం 4 షెట్టర్లు నిర్మించారు. అక్కడ ఎత్తు 10 ఫీట్లే అయినప్పటికీ ప్రాథమికంగా రూ. 23.85 లక్షలు ఖర్చు రాసి, చివరకు సరిపోక రీఎస్టిమేషన్ వేసి అదనంగా లక్షలు డ్రా చేయడం గమనార్హం.

### అనుమతులు ఉన్నప్పటికీ ఎంబీ రికార్డ్ రాకపోవడమే లోపమా?

ఈ నిర్మాణాలన్నింటికీ ముందుగానే డీసీఓ అనుమతి కోరడం, మేనేజింగ్ కమిటీ సమావేశాలు, జనరల్ బాడీ మీటింగ్‌లు నిర్వహించి, గ్రామ రెవెన్యూ అనుమతుల ద్వారానే నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టారని సొసైటీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే సాంకేతికంగా ఇంజనీరింగ్ ఎంబీ రికార్డ్ చేయించకపోవడమే ఇప్పుడు ప్రధాన వివాదంగా మారిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎంబీ రికార్డులు చేసిన ఇతర సొసైటీల కంటే ఇక్కడే తక్కువ ఖర్చుతో ఎక్కువ నిర్మాణాలు జరిగాయని లెక్కలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు సొసైటీల్లో నిర్మించిన షాపులు కేవలం కోనాపూర్ సొసైటీలోనే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉమ్మడి మెదక్, టేక్మాల్, వెల్దుర్తి, కొత్తపల్లి సొసైటీల్లో షాపుల నిర్మాణాలు జరిగాయి. అలాగే సోమకాపేటలో పెట్రోల్ పంపు, ఇబ్రహీంపూర్ సొసైటీలో పెట్రోల్ పంపుతో పాటు ఆఫీస్ బిల్డింగ్, మిర్దొడ్డి సొసైటీ పరిధిలోని భూంపల్లిలో కూడా షాపుల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. మిగతా చోట్లతో పోలిస్తే కోనాపూర్ సొసైటీ పరిధిలో శాశ్వత ఆస్తుల కల్పన తక్కువ వ్యయంతో నాణ్యంగా జరిగిందని, కేవలం సాంకేతిక కారణాలను చూపుతూ అక్రమాలు జరిగినట్లు ప్రచారం చేయడం వెనుక అసలు నిజాలేంటో బయటకు రావాల్సి ఉంది.








# పురపాలికల అభివృద్ధికి ముందడుగు!

**కలెక్టర్ చొరవతో సాగనున్న అభివృద్ధి పనులు**

**జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు, కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు**

**సమస్యలు పరిష్కారమవుతాయని హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

మెదక్, ఆగస్టు 5 (సిరి న్యూస్): మెదక్ పట్టణంలో టీయూఎఫ్ఐడీ, యూఐడీఎఫ్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పలు వార్డుల్లో కేవలం శంకుస్థాపన దశలోనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయంపై మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. పెండింగ్ పనులు, సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయా మున్సిపాలిటీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ఇతర ప్రజా సమస్యలను ఈ సమావేశంలో సమగ్రంగా వివరించాలని ప్రజాప్రతినిధులను కలెక్టర్ కోరారు. ఆయా మున్సిపాలిటీలలో పలు అభివృద్ధి పనుల కోసం ప్రొసీడింగ్లు సిద్ధమైనప్పటికీ పనులు సాగడం లేదని కలెక్టర్ దృష్టికి పలువురు కౌన్సిలర్లు తీసుకొచ్చారు. పనులు చేపడితే బిల్లుల చెల్లింపులు జరుగుతాయో లేదో అన్న అనుమానం అవసరం లేదని, ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో సమన్యాయంగా అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసినప్పుడే పట్టణ ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. అయితే గతంలో ఎన్నడు కూడా మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవని, కలెక్టర్ ప్రత్యేక చొరవతో మున్సిపాలిటీల అభివృద్ధికి ముందడుగు వేయడం శుభపరిణామమని పలువురు కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పెండింగ్ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






- సీబీఎస్ఈ సౌత్ జోన్-1 తైక్వాండో పోటీలకు ఘన శ్రీకారం
- ఐదు రాష్ట్రాల నుంచి 3 వేల మంది విద్యార్థి క్రీడాకారులు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యం: ఆర్జిన్ స్కూల్ చైర్మన్ ప్రమోద్ కుమార్

# ఆర్జిన్ స్కూల్‌లో తైక్వాండో సందడి

పటాన్‌చెరు, ఆగస్టు 5 (సిరి న్యూస్): పటాన్‌చెరులోని ఆర్జిన్ స్కూల్ వేదికగా సీబీఎస్ఈ సౌత్ జోన్-1 తైక్వాండో ఛాంపియన్‌షిప్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆగస్టు 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవుల నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. ఆర్జిన్ స్కూల్ చైర్మన్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఛాంపియన్‌షిప్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. సీబీఎస్ఈ అబ్జర్వర్ దుర్రై ముఖ్య అతిథిగా హాజరై పోటీల నిర్వహణను అభినందించారు. ఆల్ఫా స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్లు వెంకటేష్, రాంబాబు పోటీల నిర్వహణ బాధ్యతలను చేపట్టగా, వివిధ వయో విభాగాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పోటీపడుతూ తమ నైపుణ్యాన్ని చాటుతున్నారు. పోటీల నిర్వహణకు ఆర్జిన్ స్కూల్ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆర్జిన్ స్కూల్ చైర్మన్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థి క్రీడాకారులు పాల్గొనడంతో ఆర్జిన్ స్కూల్ ప్రాంగణం క్రీడా సందడితో కళకళలాడింది. ఈ ఛాంపియన్‌షిప్ ద్వారా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

